


# ఆపద్బాంధవుడు

ఆంగ్లమూలం: సోమర్‌సెట్ మామ్

అనువాదం:
కాకాని చక్రపాణి

**ముప్పయ్యేళ్లుగా నా చుట్టుపక్కలుండే మనుషులను అధ్యయనం చేయటమే నా పని. ఐనా వాళ్లను గురించి నాకంత బాగా తెలియదు. ముఖం చూసి ఓ పనివాడిని కుదుర్చుకోటమంటే నాకెప్పుడూ సంకోచమే. ఐనా, మనం మనుషుల ముఖం చూసి తీర్పులిస్తూంటాం. దవడ రూపు, కళ్ల చూపు, నోటి గీతల తీరూ చూసి మనం మన అభిప్రాయాలను ఏర్పరచుకుంటుంటాం.**

చాలా సందర్భాల్లో మన అభిప్రాయం తప్పే అవుతూవుంటుంది. తరచూ నవలలూ, నాటకాలూ జీవితాని కెందుకు అద్దం పట్టవు? కారణం, రచయితలూ, తమ అవసరాని కనుగుణంగా ఆ పాత్రలను ఒకే తీరులో మలచటం. అలా కాకపోతే ఆ పాత్రల నర్థం చేసుకోటం కష్టమవుతుంది. నిజానికి మనమంతా విభిన్నలక్షణాలున్న మనుషులం. ఓ క్రమం లేకుండా, పొసగని లక్షణాల, స్వభావాల మూటలం మనం. తాము ఓ వ్యక్తిని చూడగానే ఏర్పరచుకునే అభిప్రాయం కరెక్ట్ అనే మనుషులంటే నాకెప్పుడూ చిర్రెత్తుతుంది. బహుశా అలాంటివాళ్ల అంతర్దృష్టి అల్పమైంది అయివుండాలి, లేదూ వాళ్ల అహంకారం గొప్పదై వుండాలి. నాకు మాత్రం వ్యక్తులతో ఎంత దీర్ఘకాలపరిచయ ముంటే, అంతగా వాళ్లు నన్ను అయోమయంలో పడేస్తుంటారు. నాకెంతో కాలంగా పరిచయమున్న పాతమిత్రులున్నారు. వాళ్లను గురించి నేను చెప్పగలిగింది ఒక్కటే-వాళ్లను గురించి నాకేం తెలియదని.

ఎడ్వర్డ్ హైడ్ బర్టన్ కోబ్‌లో చనిపోయాడన్న వార్త ఉదయం పత్రికలో చదివినాక నాలో కలిగిన ఆలోచనలివి. అతను వ్యాపారి. జపానులో, ఎన్నో ఏళ్లు వ్యాపారం చేశాడు. అతన్ని గురించి నాకు తెలిసింది అల్పమే. ఐతే, అతను నన్నోసారి మహాశ్చర్యంలో ముంచెత్తటంతో నాకతని పట్ల ఆసక్తి కలిగింది. తనా పని చేయగలడని అతను స్వయంగా నాతో చెప్పకపోయినట్లయితే, నేనా కథను నమ్మగలిగివుండేవాడని కాదు. రూపంలోనూ, ప్రవర్తనలోనూ నిర్ధారితలక్షణాలున్నట్టు కనిపించే మనిషి అతను. ఎప్పుడూ ఒక్క తీరులో వుండే మనిషంటే అతనే. సన్నగా, పొట్టిగా వుండేవాడు. ఎత్తు ఐదడుగుల నాలుగంగుళాలు. తెల్లటి జుట్టు, ముడతలు పడ్డ ఎర్రటి ముఖం, నీలం కళ్లు. నాకతను పరిచయమయ్యే నాటికి అతనికి అరవై ఏళ్లుంటాయనుకుంటాను. తన వయస్సూ, స్థాయిని బట్టి అతనెప్పుడూ చక్కగా డ్రెస్ చేసుకుని కనిపించేవాడు.

అతని ఆఫీసు కోబ్‌లో వున్నా, బర్టన్ తరచూ యాకోహోమాకు వస్తూండేవాడు. ఓ సందర్భంలో నేనక్కడ, ఓడ కోసం నిరీక్షిస్తూ, కొన్నిరోజులు వుండాల్సివచ్చింది. అప్పుడు అక్కడ బ్రిటిష్ క్లబ్బులో నాకెవరో అతన్ని పరిచయం చేశారు. ఇద్దరం కలిసి బ్రిడ్జి ఆడేవాళ్లం. అతని ఆట కూడా చక్కగా, ఉదారంగా వుండేది. ఆడేప్పుడు కానీ, ఆ తర్వాత డ్రింక్స్ పుచ్చుకునేప్పుడు కానీ అతనంతగా మాట్లాడేవాడు కాదు. కానీ అతనేం చెప్పినా అది అర్థవంతంగా వుండేది. కొంత హాస్యపూరితంగానూ వుండేది. క్లబ్బులో అతనికి మంచి పేరే వుండేది. అతనెళ్లి పోయాక మంచి మనిషని కూడా క్లబ్బుల్లో నాకు చెప్పారు. అప్పుడు మేమిద్దరం గ్రాండ్ హోటల్లోనే బస చేశాం.

ఓ రోజతను నన్ను భోజనానికి పిలిచాడు. అప్పుడు అతని భార్యనూ, ఇద్దరు కూతుళ్లనూ చూశాను. ఆమె లావుగా, పెద్ద ముత్తయిదువులా వుండేది. నవ్వు ముఖం. అరమరికలు లేని కుటుంబం. ఒకరంటే ఒకరికి ప్రేమాభిమానాలున్నాయని నాకు తెలిసింది. బర్టన్‌లో నన్ను ఆకర్షించిన ముఖ్యలక్షణం

అతనిలోని దయాస్వభావం. అతని లేతనీలికళ్లలో ఆనందపరిచేదేదో వుంది. అతని కంఠం మృదువుగా వుండేది. కోపంతో అతను గొంతెత్తి అరవగలడని మనమనుకోం. అతని చిరునవ్వులో కరుణ తొణికిసలాడేది. పక్కవారి పట్ల నిజమైన ప్రేమున్న వ్యక్తి అతను. అందుకే అతనంటే ఆసక్తి కలుగుతుంది, ఆకర్షణ కలుగుతుంది. అతను తేలిగ్గా ఆవేశపడే వ్యక్తి కాదు. పేకాట అన్నా, కాక్‌టైల్ అన్నా అతని కిష్టం. రసవత్తరంగా కథలు వినిపించగలడు. వయసులో మంచి అథ్లెట్ అతను. ధనవంతుడు. ప్రతి పైసా అతను కష్టించి ఆర్జించిందే. అతనంటే ఇష్టం కలిగించే మరో లక్షణం-అతని స్వల్పపరిమాణం గల ఆకారం. ఎదుటి వ్యక్తిలో రక్షణభావాన్ని అతను రేకెత్తించగలడనుకుంటాను. ఓ ఈగకు కూడా హాని చేయని తత్వం అతనిది అనిపిస్తుంది.

ఓ మధ్యాహ్నం నేను గ్రాండ్ హోటల్ లాంజ్‌లో కూర్చుని వున్నాను. అది భూకంపానికి ముందు సంగతి. వాళ్లక్కడ చర్మంతో చేసిన పడక్కుర్చీలు వేశారు. కిటికీలో నుంచి ఓడ రేవు, జనం రద్దీ కనిపిస్తున్నాయి. షాంఘై, హాంగ్‌కాంగ్, సింగపూర్‌ల గుండా వాన్‌కోవర్, శాన్‌ఫ్రాన్సిస్కో, లేదా యూరప్‌లోని ఓడ రేవులకు వెళ్లే పెద్దపెద్ద ఓడలు లంగరు వేసి కనిపించాయి. రంగురంగుల తెరచాపలూ, ఎన్నో శాంపాన్లు (చిన్న పడవలు), వివిధదేశాల నుంచి వచ్చిన మనుషులు, సముద్రపుగాలికి మారిన వాళ్ల ముఖాలు. రద్దీగా, ఆవేశం కల్పించే విధంగా వుందా దృశ్యం. అయినా ఎందుకో తెలీదు, ఆత్మకింపుగా వుంది ఆ దృశ్యం. అందులో ఏదో కాల్పనికత వుంది. చెయ్యెత్తి అందుకునేట్లుగా వుంది అది.

అప్పుడు బర్టన్ లాంజ్‌లోకి వచ్చాడు, నన్ను చూశాడు. నా పక్క కుర్చీలో కూర్చున్నాడు.

"ఓ చుక్క వేసుకుందామా?"

చప్పట్లు చరిచి, బాయ్‌ని పిలిచి, రెండు పెగ్గుల జిన్ పట్టుకురమ్మని ఆదేశమిచ్చాడు. బాయ్ జిన్ తీసుకువచ్చాడు. బర్టన్ వీధిలో వెళ్తున్న ఓ మనిషిని చూపాడు నాకు. చేత్తో సంజ్ఞ చేస్తూ. "నీకు టర్నర్ తెలుసా?" అన్నాడు బర్టన్.

నేను తలూపుతూ, "నేనతన్ని క్లబ్బులో కలిశాను. ఇంటి నుంచి డబ్బు తెప్పించుకుని ఇక్కడ జీవితం వెళ్లదీస్తున్నాడని చెప్పారు నాకు" అన్నాను.

"అవును, అలాంటివాడే. అలాంటివాళ్లు చాలామంది వున్నారిక్కడ."


"అతను బ్రిడ్జి బాగా ఆడతాడు."

"వాళ్లు బాగానే ఆడతారు. క్రితం ఏడాది ఇక్కడి కొకతను వచ్చాడు. విచిత్రంగా అతనిదీ నా పేరే. నాకు తెలిసినంతలో అలాంటి బ్రిడ్జి ఆటగాణ్ని నేను చూడలేదు. అతన్నెప్పుడూ నువ్వు లండన్‌లో చూసి వుండవు. తన్ను లెన్నీ బర్టన్ అని చెప్పుకుంటాడు. మంచి క్లబ్బుల్లో ఆడిన మనిషి అతను."

"లేదు. నా కా పేరు ఎప్పుడూ విన్నట్టు లేదు."

"అబ్బో, మంచి ఆటగాడు! కార్డులను గురించిన ఇన్‌స్టింక్టేదో వున్నది అతనికి. ఎలాంటిదో చెప్పలేం. నేనతనితో ఎన్నోసార్లు ఆడాను. అతను కోచ్‌లో కొంత కాలం వున్నాడు."

బర్టన్ జిన్‌ను సిప్ చేశాడు. "ఇది




గమ్మత్తయిన కథ" అన్నాడతను. "చెడ్డమనిషి కాడతను. నాకతనంటే ఇష్టం కలిగింది. అతనెప్పుడూ చక్కగా డ్రెస్ చేసుకుని, స్మార్ట్‌గా కనిపించేవాడు. రింగుల జుట్టు. ఎర్రటి బుగ్గలు-అందగాడే అనిపించేటట్టుండేవాడు. స్త్రీలకు అతని పట్ల ఆకర్షణ వుండేది. చెడు తలంపు వుండేది కాదు అతనిలో. కాని, క్రమం లేని జీవితం. విపరీతంగా తాగేవాడు. అలాంటి మనుషుల కది అలవాటే. ఏ మూడునాలుగు నెల్లకో కొద్దిగా డబ్బు వచ్చేది, పేకాటలో కొంత డబ్బు చేసుకునేవాడు. అతనితో ఆడి నేనెంతో డబ్బు పోగొట్టుకున్నాను."

బర్టన్ దయుగా నవ్వాడు. అతను బ్రిడ్జిలో మహదానందంగా డబ్బు పోగొట్టుకోగలడని నా అనుభవంలో వున్న విషయమే. తన పల్చటి చేత్తో తన నున్నటి గడ్డాన్ని నిమురుకున్నాడతను; చేతి రక్తనాళాలు పారదర్శకంగా కనిపిస్తున్నాయి.

"బహుశా, అందుకే ననుకుంటానుఅతను దివాలా తీసినప్పుడు నా దగ్గరి కొచ్చాడు; ఆ పైన నాదీ తన పేరే అవటం వల్ల నా దగ్గరి కొచ్చాడనుకుంటాను. నన్ను ఆఫీసులో కలిశాడు. ఉద్యోగమేదైనా ఇమ్మన్నాడు. నాకెంతో ఆశ్చర్యం కలిగింది. ఇంక తనకు ఇంటి దగ్గరి నుంచి డబ్బు వచ్చే అవకాశం లేదనీ, అందుకే ఏదైనా ఉద్యోగం చేసుకోవాలనుకుంటున్నాడనీ చెప్పాడతను. అతని వయస్సెంత అని అడిగాను.

" 'ముప్పై ఐదు' అని చెప్పాడతను.

" 'మరిప్పటి దాకా ఏం చేస్తూ వచ్చావు నువ్వు?' నేనడిగానతన్ని.

" 'లేదు. చేసిందేమీ లేదు.'

" 'నేనూ నవ్వక తప్పలేదు. 'ప్రస్తుతానికి నేను నీకేం చేయలేను' అన్నాను. మళ్లీ వచ్చి ముప్పై ఐదేళ్ల తర్వాత నన్ను కలువు. అప్పుడు నేన్నీ కోసం ఏం చేయగలనో చూస్తాను.'

"అతను కదల్లేదు. అతని ముఖం పాలిపోయింది. ఓ క్షణం సంకోచించాడు. ఆ తర్వాత చెప్పాడు-ఈ మధ్య తనను పేకాటలో దురదృష్టమే వరిస్తోందని. అతను బ్రిడ్జిని అంటిపెట్టుకుని లేడు. పోకర్ కూడా బాగా ఆడతాడు. అదే దెబ్బ తీసింది. చేతిలో పైస లేదు. ఏవైనా వస్తువులుంటే తనఖా పెట్టాడు. హోటల్ బిల్లు చెల్లించటం కష్టమైంది అతనికి. వాళ్లింక అతనికి అప్పు పెట్టేట్టు లేరు. బాగా

చితికిపోయాడు. ఏ పనీ దొరక్కపోతే అతనికి మార్గాంతరం లేదు, ఆత్మహత్య తప్ప!

"నేనతన్ని ఓ క్షణం చూశాను. మనిషి బాగా దెబ్బ తిన్నాడనిపించింది. మామూలు కంటే విపరీతంగా తాగుతున్నాడు. యాభై ఏళ్ల మనిషిలా కనిపించాడు. అప్పుడతన్ని చూస్తే, అమ్మాయిలకు రోత కలుగుతుంది.

" 'సరే, పేకాట మినహా నువ్వు చేయగలిగిందేం లేదా?' అనడిగానతన్ని.

" 'బాగా ఈదగలను' అన్నాడతను.

" 'ఈదటమా?' నేను నా చెవులను నమ్మలేకపోయాను. అంత పిచ్చి సమాధానం అనిపించిందది.

" 'మా యూనివర్సిటీ ఈతపోటీల్లో పాల్గొని విజయం పొందాను.'

"అతను నన్నెటువైపు నడిపిస్తున్నాడో నాకస్పష్టంగా అర్థమైంది. యూనివర్సిటీల్లో ఇలాంటి కృత్యాల పట్ల ఆకర్షితులయ్యే కొంత మంది అధికారులు నాకు తెలుసు.

" 'నేను యువకుడుగా వున్నప్పుడు మంచి ఈతగాణ్నే' అన్నాడతను.

"అకస్మాత్తుగా నాకో ఆలోచన వచ్చింది." కథనాన్ని ఆపి బర్టన్ నా వంక తిరిగాడు. "కోచ్ తెలుసా నీకు?" అతనడిగాడు.

"లేదు" అన్నాను. "ఓ సారి అలా వెళ్లటం తటస్థించింది కానీ, ఓ రాత్రి మాత్రమే అక్కడ బస చేశాను."

"మరప్పుడు నీకు షియెయో క్లబ్బు తెలీదన్నమాట! నేను యువకుడుగా వున్నప్పుడు అక్కడి లైట్ హౌస్ చుట్టూ ఈది, తారుమీ వాగు గట్టెక్కాను. ఆ దూరం మూడు మైళ్లుంటుంది. లైట్ హౌస్ చుట్టూ లేచే అలల వల్ల ఈదటం మహాకష్టం. సరే, నా పేరున్న మనిషికి అదంతా చెప్పాను. తనూ ఆ పని చేయగలిగితే అతనికేదో ఉద్యోగం ఇస్తానని చెప్పాను."

"అతను నిర్ఘాంతపోయాడు.

" 'నువ్వు మంచి ఈతగాడినన్నావుగా?' నేనడిగాను.

" 'నా పరిస్థితి ఇప్పుడంత బాగా లేదు' జవాబిచ్చాడతను.

"నేనేం మాట్లాడలేదు. అతని పట్ల నాకు ఏవగింపు కలిగింది.

"అతను నా వంక ఓ క్షణం చూశాడు. ఆ పైన బుర్ర ఊపాడు, అంగీకరిస్తూ. 'మంచిది. మరెప్పుడు ఈదమంటావు?' అడిగాడతను.

"నేను నా వాచ్ వంక చూశాను. సమయం పది గంటలు దాటింది. 'ఆ దూరం ఈదటానికి గంటా, గంటంపావు కంటే ఎక్కువ పట్టదు. ఏటి దగ్గరికి పావు తక్కువ పన్నెండింటికి కారులో వస్తాను. అక్కడ నిన్ను కలిశాక మనం క్లబ్బుకు వద్దాం. నువ్వు డ్రెస్సు మార్చుకున్నాక, మనమిద్దరం కలిసి లంచ్ చేద్దాం.'

" 'సరే' అన్నాడతను.

"మేం చేతులు కలుపుకున్నాం. అతన్ని అదృష్టం వరించాలని నేను కోరుకున్నాను. అతను వెళ్లిపోయాడు. ఆ ఉదయం నాకు చేయవలసిన పని ఎంతో వుంది. ఎలాగో పూర్తి చేసి, పన్నెండున్నరకల్లా తారుమీ వాగుకు వచ్చాను. నేను అంత హడావుడి పడివుండాల్సింది కాదు. అతనక్కడ కెప్పుడూ రాలేదు."

"చివరి క్షణంలో గుండె జారి మానేశాడా?" నేనడిగాను.


"లేదు. బేజారై మానలేదు. ఈదటం ప్రారంభించాడు. ఐతే, అతను తాగుడుతో, తిరుగుడుతో శారీరకారోగ్యాన్ని కోల్పోయాడు. లైట్ హౌస్ చుట్టూ లేస్తున్న అలలను తరించటం అతనికి సాధ్యం కాలేదు. మూడు రోజుల దాకా అతని శరీరం మాకు దొరకలేదు."

ఒకటి రెండు క్షణాలు నేనేం మాట్లాడలేకపోయాను. నాకు కొద్దిగా షాకనిపించింది. అప్పుడు నేను బర్టన్‌ను ఓ ప్రశ్న వేశాను. "నువ్వతనికి ఉద్యోగం ఇస్తానన్నప్పుడు, అతను నీళ్లలో మునిగిపోతాడని నీకు తెలుసా?"

అతను మెల్లగా నవ్వాడు. నా వంక తన కరుణాపూరితనీలినేత్రాలతో చూశాడు. చేత్తో గడ్డాన్ని రుద్దుకున్నాడు.

"ఏమో, ఆ క్షణంలో నా ఆఫీసులో ఎలాంటి ఖాళీ లేదు!"

■



## డానీ ఉదారహృదయం

సినిమాలో చూసే విలన్లు సాధారణంగా బయట కూడా భయం కలిగిస్తుంటారు. తమ కారుకు ఆక్సిడెంట్ చేసి దాన్ని పచ్చడి చేసిన డ్రైవర్లను ఏ నటుడూ కూడా వెళ్లగొట్టకుండా వుండడు. కానీ బాలీవుడ్ విలన్ డానీ డెన్‌జోంగ్‌పా ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించాడు. ఇటీవల డానీ సరికొత్త కారును నడిపిన పాత డ్రైవర్ ఒక ఆక్సిడెంట్‌లో ఇరుక్కుని ఆస్పత్రి పాలయ్యాడు. కారు కూడా తుక్కుతుక్కయింది. దాని మరమ్మతులకే దాదాపు రెండు లక్షలు ఖర్చయ్యే పరిస్థితి ఏర్పడిందట. ఇన్సూరెన్స్ కంపెనీవారు దాన్ని భరిస్తామన్నారట. డానీ వెంటనే డ్రైవర్ ఆస్పత్రి ఖర్చులకు కావలసినంత డబ్బిస్తూ, "బాబూ! ఈ కారు పోతే మరోటి కొనుక్కోగల స్తోమత వుంది నాకు. కానీ నమ్మకంగా పని చేసే నీలాంటి డ్రైవర్ మరొకడు నాకు దొరకడు. కోలుకున్నాక మామూలుగా వచ్చి పనిలో చేరు" అన్నాట్ట, అతనికి షాక్ తినిపిస్తూ. సినిమాల్లో ఎవరో రాసిన డైలాగులు పలికే డానీ, అచ్చంగా అటువంటి వాక్యాలే వాడాడన్నారట అందరూ. డానీ సాబ్, నిజంగా మీ మనసు బంగారమండీ!

ఎస్.